రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

అధికారులతో మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి, జూన్ 10 : వచ్చే వానకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ముందస్తుగా ప్రణాళికబద్ధంగా కార్యాచరణ రూపొందించాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో కామారెడ్డి నియోజకవర్గంలో పూర్తయిన ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వచ్చే 2024-25 వానకాలం సీజను కుముందస్తుగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌తో కలిసి సోమవారం సమీక్షిస్తూ అధికారులు, మిల్లర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలు, రైస్‌మిల్లుల వద్ద వివిధ కారణాలతో తరుగు తీస్తున్నారని ఇది సరికాదని అన్నారు. కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ మాట్లాడుతూ.. యాసంగి సీజన్‌లో జిల్లాలో 350 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 3,27,631 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో 85 కేంద్రాల ద్వారా 93 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, జిల్లా మేనేజర్ నిత్యానందం, జిల్లా మార్కెటింగ్ అధికారిణి రమ్య, ఎఫ్‌సీఐ డివిజనల్ మేనేజర్ ప్రకాశ్, జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి, జిల్లా సహకార అధికారి శ్రీనివాస్, డీసీఎంఎస్ అధికారి, రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు లింగం పాల్గొన్నారు.

కార్మికుల సంబురాలు

బీడీ కార్మిక సంఘం నాయకుడు సిద్ధిరాములను సన్మానిస్తున్నా టేకేదార్లు

మాచారెడ్డి, జూన్ 10 : బీడీ కార్మికులు, ప్యాకర్లు, బట్టి బీడీ టేకేదార్లకు వేతనాలు పెరగడంతో కార్మికులు సంబురాలు నిర్వహించారు. పాల్వంచ మండల కేంద్రంలోని లాంగర్ బీడీ కంపెనీలో పనిచేసే కార్మికులతో కలిసి బహుళ జన బీడీ నాయకులు, బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధిరాములు ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పని చేస్తున్న సుమారు ఎనిమిది లక్షల మంది బీడీ కార్మికుల వేతనల పెంపుపై హర్షం వ్యక్తం చేశారు. బీడీ కార్మికుల యాజమన్యంతో పోరాడి కార్మికుల వేతనాలు పెంచేలా తమ యూనియన్ తరపున పోరాడమని అన్నారు. అనంతరం కార్మికులకు స్వీట్లు పంచిపెట్టి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముద్రకోల ఆంజనేయులు, తుమ్మ శ్రీనివాస్, నరహరి, మధు, జ్ఞానేశ్వర్, బ్రహ్మం, మురళి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, జూన్ 10 : మెడికల్ కళాశాలను కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ సోమవారం సందర్శించారు. ల్యాబ్‌లను పరిశీలించారు. గ్రంథాలయాన్ని సందర్శించగా పుస్తకాల కొరత ఉందని అధికారులు తెలపడంతో కావాల్సిన పుస్తకాలు ఇప్పించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కళాశాలలో తాగునీటి సమస్యను తణక్షమే పరిష్కంచాలని మున్సిపల్ కమిషనర్ సుజాతను ఆదేశించారు. తాగునీటి ఎద్దడిని శాశ్వతంగా పరిష్కరించాలని తెలిపారు. మెడికల్ కళాశాల ఆవరణలో ఉద్యానవనం ఏర్పాటు కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. ఉద్యానవనంలో ఔషధ మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ సుజాత, అధ్యాపకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

జంతువుల రక్షణ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోకి రామేశ్వరపల్లిలో ఉన్న జంతువుల రక్షణ కేంద్రాన్ని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి మున్సిపల్ ఆధ్వర్యంలో జంతువులకు రక్షణ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కుక్కలకు ఇక్కడ శస్త్ర చికిత్సలు చేయించనున్నట్లు అధికారులు తెలిపారు. కుక్కల బారి నుంచి ప్రజలను రక్షించడానికి జంతువుల రక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సింహారావు, అధికారులు సంజయ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

బాన్సువాడ రూరల్, జూన్ 10 : మిషన్‌భగీరథ పథకంలో ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిల సమగ్ర సర్వేను పంచాయతీ కార్యదర్శులు పకడ్బందీగా చేపట్టాలని డీఎల్‌పీవో నాగరాజు సూచించారు. మండలంలోని దేశాయిపేట్ గ్రామంలోని రైతువేదిక భవనంలో డివిజన్‌లోని బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, పిట్లం, నిజాంసాగర్ మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు సోమవారం ఒక రోజు శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటికీ నీటికుళాయి ఉందా, నీళ్లు సక్రమంగా సరఫరా అవుతున్నాయా, సరఫరా చేస్తున్న నీళ్లు కుటుంబానికి సరిపోతున్నాయా, పైప్ లైన్ లీకేజీలు ఏమైనా ఉన్నాయా అనే తదితర వివరాలను సర్వే ద్వారా గుర్తించాలని అన్నారు. ప్రత్యేకంగా ఏర్పాట చేసిన యాప్‌లో సేకరించిన వివరాలను నమోదు చేయాలని సూచించారు. గుర్తించిన సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. సర్వేను త్వరితగతంగా చేపట్టి పూర్తి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారాయణ, ఈ పంచాయతీ ఆపరేటర్ వినయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల శిక్షణలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో నాగరాజు

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి, జూన్ 10 : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కామారెడ్డి సమీకృత కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చే ఫిర్యాదులను రెవెన్యూ అధికారులు వెంటనే పరిష్కారం చూపాలని అన్నారు. రెవెన్యూ 33, వ్యవసాయం ఆరు, సివిల్ సప్లై రెండు, మున్సిపల్ నాలుగు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ రెండు, విద్యాశాఖకు ఒకటి, గ్రామ పంచాయతీకి రెండు, గిరిజన సంక్షేమ శాఖకు ఒకటి చొప్పున ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో నిర్వహించే ప్రజావాణిలో జిల్లాకు సంబంధించిన 391 వినతులు అందగా ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆ వినతులను జిల్లాకు పంపారని తెలిపారు. వాటిని సంబంధిత శాఖలు అత్యంత ప్రాధాన్యతనిచ్చి ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించి పరిష్కరించాలన్నారు. దరఖాస్తులను పరిష్కరించకుంటే సకాలంలో తెలిపాలన్నారు. పరిష్కరించిన వినతులను prajavanisno@gmail.com లో వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు రాజారామ్, రాజు, దయానంద్, వరదారెడ్డి, భాగ్యలక్ష్మి, శ్రీధర్, శ్రీనివాస్, బావయ్య పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

భిక్కనూరులో ఉపాధ్యాయులకు పుస్తకాల పంపిణీ చేస్తున్న దృశ్యం

భిక్కనూరు, జూన్ 10 : ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న పాఠ్యపుస్తకాలను సోమవారం మండల విద్యాధికారి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

గుండారంలో రథం ఊరేగింపు

గుండారంలో రథాన్ని లాగుతున్న భక్తులు

రాజంపేట్, జూన్ 10 : మండలంలోని గుండారంలో గ్రామ దేవతల రథం ఊరేగింపును సోమవారం నిర్వహించారు. శనివారం ఎడ్లబండ్ల ప్రదర్శనతో ప్రారంభమైన ఉత్సవాలు సోమవారం రథోత్సవంతో ముగిశాయి. మూడు రోజులపాటు ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారని మాజీ సర్పంచ్ ర్యాకం లక్ష్మణ్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బండారి సిద్ధారెడ్డి, శ్యామ య్య, నారాగౌడ్, వెంకట్‌గౌడ్, సాయాగౌడ్, ప్రవీణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట నలుగురి బైండోవర్

ఇందల్వాయి, జూన్ 10 : మండలంలోని వెంగళ్‌పాడ్‌కు చెందిన ముగ్గురు, దేవీతండాకు చెందిన ఒకరిని సోమవారం తహసీల్దార్ వెంకట్‌రావు సమక్షంలో బైండోవర్ చేశారు. పక్కా సమాచారం మేరకు సారా కాస్తున్న నలుగురిని ఎక్సైజ్ సీఐ వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం పట్టుకున్నారు. అనంతరం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

రైతులు తొందరపడి విత్తుకోవద్దు

గాంధారి, జూన్ 10: రైతులు తొందరపడి విత్తనాలను విత్తుకోకూడదని గాంధారి వ్యవసాయాధికారి నరేశ్ సూచించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు పూర్తిగా ప్రవేశించలేదని, అక్కడక్కడ కురుసున్న వర్షాలకు తొందరపడి విత్తనాలను విత్తుకోకూడదని తెలిపారు. వ్యవసాయ భూములు పూర్తిగా తడకపోవడం, భూమిలో తేమ శాతం సరిగాలేక విత్తనాల్లో మొలక శాతం తక్కువగా వస్తుందని పేర్కొన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసిన తరువాతే రైతులు విత్తనాలను విత్తుకోవాలని సూచించారు.

కామారెడ్డికి తరలివెళ్లిన బీఎన్‌ఆర్‌కేఎస్ సభ్యులు

ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డి జిల్లా కేంద్రానికి తరలివెళ్తున్న భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం సభ్యులు

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 10: ఎల్లారెడ్డి పట్టణం నుంచి భవన నిర్మాణ రంగ కార్మిక సంఘ సభ్యులు జిల్లాకేంద్రానికి సోమవారం తరలివెళ్లారు. బీఎన్‌ఆర్‌కేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కామల ఐలన్న ఇచ్చిన పిలుపుమేరకు 13 డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లినట్లు సంఘ సభ్యులు తెలిపారు. కామారెడ్డికి వెళ్లిన వారిలో ఎల్లారెడ్డి మండల కమిటీ అధ్యక్షుడు సాయిబాబా, సాయిలు, శ్యాం, కాంతారావ్, దావీద్, దుర్గా సింగ్, లక్ష్మణ్, చందు, నాగరాజ్, సాయిలు, బాల్‌రాజ్, హనుమంతు, రాజు తదితరులున్నారు.

పోచారం ప్రధాన కాలువ వద్ద పిచ్చి మొక్కల తొలగింపు

పోచారం ప్రధాన కాలువ సైడ్‌వాల్స్‌పై పెరిగిన పిచ్చి మొక్కలను తొలగిస్తున్న నీటిపారుదల శాఖ సిబ్బంది

నాగిరెడ్డిపేట, జూన్ 10 : మండలంలోని పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువ, సైడ్‌వాల్స్‌పై పెరిగిన చెట్లు, పిచ్చి మొక్కలను నీటిపారుదల శాఖ సిబ్బంది తొలగిస్తున్నారు. పదేండ్లుగా తుమ్మ చెట్లు పెరిగి కాలువలో అడ్డుగా వస్తున్నాయి. నిధులు లేక ఇప్పటి వరకూ వాటి తొలగింపు పనులు చేపట్టలేదు. గతేడాది నీటి పారుదల శాఖకు లస్కర్లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. దీంతో సదరు సిబ్బంది ప్రతి రోజూ కాలువ ఒడ్డుపై పెరిగిన గడ్డి, పిచ్చి మొక్కలు, చెట్లను తొలగిస్తున్నట్లు డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

పాఠశాలలకు ఏకరూప దుస్తుల పంపిణీ

సదాశివనగర్‌లో డీఆర్డీవోకు ఏకరూప దుస్తులను అందజేస్తున్న మహిళ శక్తి సంఘ సభ్యులు

నాగిరెడ్డిపేట్‌లో కస్తుర్బా విద్యాలయం ఎస్‌వో వీణకు ఏకరూప దుస్తులను అందజేస్తున్న ఎంపీపీ వినీత, జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి

రామారెడ్డి జూన్ 10: సదాశివనగర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ఏకరూప దుస్తులను ఎంఈవోకు డీఆర్డీవో చందర్‌నాయక్, ఎంపీడీవో సంతోష్‌కుమార్‌తో కలిసి సోమవారం అందజేశారు. ఏకరూప దుస్తులను మహిళా స్వయం శక్తి సంఘాల సభ్యులు కుట్టగా. పాఠశాలలకు అధికారులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీవో సురేందర్‌రెడ్డి, ఏపీఎం రాజిరెడ్డి, సీసీలు అంజయ్య, అబ్బలింగం, అంజలి, సౌమ్య, మహిళా సంఘం అధ్యక్షురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట్‌లో..

నాగిరెడ్డిపేట, జూన్10 : మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మహిళా శక్తి కుట్టు కేంద్రం ద్వారా తయారు చేసిన దుస్తులను కస్తుర్బా గాంధీ విద్యాలయం ఎస్‌వో వీణకు ఎంపీపీ వినీతా దుర్గారెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి సోమవారం అందజేశారు. పాఠశాలలోని 224 మంది విద్యార్థులకు ఒక జత చొప్పున దుస్తులను అందించినట్లు ఏపీఎం జగదీశ్ తెలిపారు. సకాలంలో దుస్తులను తయారు చేసి అందిస్తున్న కుట్టు కేంద్రం సభ్యులను అధికారులు అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పర్భన్న, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శాంత, సీసీలు దత్తు, రమేశ్, నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, సమాఖ్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గాంధారిలో పూర్తిగా వెలగని దీపాలు

గాంధారి, జూన్ 10: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ దీపాలు వెలగడంలేదు. మండల కేంద్రంలోని కామారెడ్డి, బాన్సువాడ ప్రధాన రహదారి, వాగుపై ఉన్న వంతెన నుంచి ప్రభుత్వ దవాఖాన వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. కొన్ని రోజులుగా ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన దీపాలు వెలగడంలేదు. దీంతో అంధకారం నెలకొని పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శివ్వానగర్‌లో క్రికెట్ టోర్నీ

ప్రారంభించిన ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్

ఎల్లారెడ్డి, జూన్ 10: మండలంలోని శివ్వానగర్ శివారులో నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ సోమవారం ప్రారంభించారు. స్థానిక నాయకుడు కురుమ సాయిబాబా తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఐదు రోజుల పాటు టోర్నీ కొనసాగనున్నది. టోర్నీల్లో అన్ని మండలాల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు.అనంతరం సీఐ రవీందర్‌నాయక్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సై మహేశ్, నాయకులు వినోద్‌గౌడ్, గోపికృష్ణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ

ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలి

నాగిరెడ్డిపేట, జూన్10 : చిన్నారులకు క్రమశిక్షణతో కూడిన చక్కటి విద్య అందాలంటే.. ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని ఉపాధ్యాయులు పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు సోమవారం ఇంటింటికి తిరుగుతూ పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో సర్కారు అందిస్తున్న పథకాలు, మెరుగైన విద్యాబోధన గురించి వివరించారు. బంగారు భవిష్యత్తుకు తాము బాధ్యతను తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సీఆర్‌పీ రాజు, ఆయా గ్రామాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

గోలిలింగాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలి

గాంధారి, జూన్ 10: నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలని గాంధారి ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. ప్రతిరోజూ నీరు పట్టించాలని, కలుపు మొక్కలను తొలగించాలని పేర్కొన్నారు.భారీ వర్షాలు కురిసేలోపు మొక్కలను నాటడానికి సిద్ధంగా ఉంచాలని సూచించారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహిస్తే పంచాయతీ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నేడు కామారెడ్డిలో విద్యుత్‌కు అంతరాయం

కామారెడ్డి, జూన్ 10 : జిల్లా కేంద్రంలోని 132 కేవీ సబ్ స్టేషన్‌లో లైన్ (విద్యుత్) మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ కిరణ్ చైతన్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డిలోని విద్యానగర్ రోటరీ పార్క్ ఏరియా, వాణి నవశక్తి బీడీ కంపెనీ, దేవునిపల్లి, హౌసింగ్ బోర్డు కాలనీ, సబ్‌స్టేషన్, ఇస్లాంపుర, కాకతీయ నగర్‌లో సబ్ స్టేషన్, ఎస్ఎస్ 1 సబ్‌స్టేషన్, ఏరియాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి

పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏఈ శ్రీనివాస్ రెడ్డి

పెద్ద కొడప్‌గల్, జూన్ 10: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఏఈ పీఆర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులను ఏఈ శ్రీనివాస్ స్థానిక నాయకులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించినట్లు తన దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట నాయకులు మహేందర్‌రెడ్డి, మోహన్, రాజు దేశాయ్, విఠల్, పండరి తదితరులు ఉన్నారు.

ఎంపీపీ వినీతకు సన్మానం

నాగిరెడ్డిపేట, జూన్10 :మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన ఎంపీపీ వినీత దుర్గారెడ్డిని మండల సమాఖ్య అధ్యక్షురాలు శాంత, కమిటీ సభ్యులు సోమవారం ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ అధ్యక్ష స్థానంలో మహిళ ఉండడం సంతోషంగా ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గాయపడిన మహిళకు చికిత్స అందజేస్తున్న వైద్యుడు

బిచ్కుంద, జూన్ 10: మండల కేంద్రంలోని పత్లాపూర్ గ్రామం వద్ద 161 నంబర్ జాతీయరహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. జాతీయ రహదారి పెట్రోలింగ్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మద్నూర్‌కు చెందిన ఇద్దరు హైదరాబాద్‌కు బైక్‌పై వెళ్తుండగా పత్లాపూర్ గ్రామం వద్ద 161 జాతీయ రహదారిపై జింక అడ్డు రావడంతో అదుపు తప్పి కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో ఒకరు గాయపడగా.. మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరిని హైవే పెట్రోలింగ్ సిబ్బంది అంబులెన్స్‌లో బిచ్కుంద ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ డాక్టర్ భరత్ చికిత్స చేసి బాన్సువాడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.